



"శకుంతలా!"

"ఊఁ."

"సన్నగా కాటుక తీర్చి దిద్దిన నీ కనురెప్పలు ఎంత బాగున్నాయో చెప్పనా?"

"ఊఁ! చెప్పండి."

"నల్లని గండుతుమ్మెదలు పద్మం మీద వాలి మకరందాన్ని ఆస్వాదించి లేచి పారిపోబోయేముందు సుతారంగా రెక్క లార్చుకుంటున్నట్లున్నాయి."

"నిజంగానా?"

"నిజం, శకూ!"

శకుంతల గలగల నవ్వింది.

"నీ లాటి అప్సరస నాకు భార్యగా లభించటం నా అదృష్టం కదూ!" గోముగా అన్నాడు రామ్మూర్తి.

"మరి నా సంగతో—నేనూ అదృష్టవంతురాలినే!" అందిశకుంతల, రామ్మూర్తి ముఖాన్ని రెండు చేతులతో దగ్గరగా తీసుకుంటూ.

కొద్ది నిమిషాల్లోనే అతని చేరువలో నిద్రలోకి జారిపోయింది శకుంతల, అతడు చెప్పే కమ్మని కబుర్లు వింటూ.

శకుంతలకు నిద్ర పట్టిందని నిశ్చయించుకున్నాక ఆమె తల కింద దిండు జాగ్రత్తగా సర్ది మెల్లగా మంచం మీద నుండి లేచాడు. గది దాటి బయట వరండాలోకి వచ్చాడు.

దూరంగా పోలీసుఠాణాలో పదకొండు గంటలు కొట్టారు. బయట చిమ్మ చీకటిగా ఉంది. మెల్లగా అవతలి గదిలోకి వెళ్ళి లైటు వెలిగించి టేబిలు ముందు కుర్చీలో కూలబడ్డాడు

ఇప్పుడు అతడి మనసు కొంత తేలిక పడింది.

శకుంతల కొంత దారిలోకి వస్తున్నట్లే అనిపించింది.

రామ్మూర్తికి శకుంతలతో వివాహమయి ఎనిమిది నెలలు కావస్తూంది. అయితే, ఇద్దరి మధ్యా ఈ ఎనిమిది నెలల లోనూ ఇసుమంతయినా సఖ్యత ఏర్పడ లేదు. ప్రతి విషయంలోనూ శకుంతల స్వేచ్ఛగా మాట్లాడటం రామ్మూర్తికి నచ్చదు. అన్ని విషయాలు కుండబద్దలు కొట్టినట్లు ముఖం మీద చెప్తున్నది ఈ విషయంకూడా రామ్మూర్తికి నచ్చ లేదు

'భార్యాభర్త లిద్దరూ సమానమే! భార్య భర్తకి లొంగి ఉండనక్కరలేదు. ఎవరి అభిప్రాయాలను వాళ్ళు నిర్భీతిగా వెల్లడించుకోవాలి. భార్యా భర్తల మధ్య కూడా దాగుడుమూతలయితే ఎలా?' అనేది ఆమె సిద్ధాంతం. రామ్మూర్తికి ఈ సిద్ధాంతం బొత్తిగా కిట్టలేదు.

'ఆడదన్నాక మొగాడికి లొంగి ఉండవలసిందే' అన్నది అతని నిశ్చితాభిప్రాయం.

భార్యని తన అదుపులో ఉంచుకోవటానికి అనేక విధాల యత్నించాడు. కాని, అతని ప్రయత్నాలేవీ ఇసుమంతయినా ఫలించలేదు

'భార్యని లొంగదీసుకోవటం ఎలా?' అన్నది అతని ముందు పెద్ద సమస్యగా నిలిచింది. ఈ సమస్య అతని ముందు నిలిచాక ఇద్దరి మధ్య అగాధం మరీ పెద్దదయింది. ప్రతి చిన్న విషయం పెద్ద తగువుగా మారింది. ఆఖరుకు కొన్ని సమయాల్లో భార్యమీద చేయి చేసుకున్నాడు. ఒళ్ళు అప్పగించి దెబ్బలు తిన్నదే కాని, తన ప్రవర్తన మార్చుకునే ప్రయత్నం చేయలేదు శకుంతల. దానితో మరీ రెచ్చిపోయాడు రామ్మూర్తి. రెచ్చిపోయాడే కాని, భార్యను తన అభిప్రాయాలకు అనుగుణంగా ఒదిగి ఉండేటట్లు ఎలా మార్చుకోవాలో మాత్రం అతనికి అంతుబట్టలేదు.

అయితే, రెండు దినాల క్రితం ఈ విషయంలో అతనికి అమృతం లాటి సలహా ఒకటి లభించింది. ఒక మహా రచయిత్రి వ్రాసిన గొప్ప నవల చదువుతున్నాడు. అందులో ఆఖరు పేజీ, ఆఖరు పేరాలో బంగారు తీగె లాటి సందేశం దొరికింది. "పొగడ్తకు లొంగని స్త్రీ ఈ లోకంలో ఉండదు!" అన్న వాక్యం అతన్ని అమితంగా ఆకర్షించింది. రచయిత్రి వ్రాసిన వాక్యం! అంటే, ఎంత అనుభవంతో వ్రాసిందో ఆవిడ!

రామ్మూర్తి అది చదివాక ఎగిరి గంతేసినంత పని చేశాడు.

అతనికి ఈ ఎనిమిది నెలల కాలంలోను ఇంత చక్కని సలహా ఎవరూ చెప్పలేదు. ఏ సినిమాలోనూ చూపించలేదు. ఆ వాక్యాన్ని పదిమార్లు చదువుకున్నాడు. వంద మార్లు మననం చేసుకున్నాడు.

తరవాత ఈ ఎనిమిది నెలల జీవితాన్ని ఒక్కమారు పునశ్చరణ చేసుకున్నాడు.

'వివాహమయ్యాక తన భార్యను తాను ఎన్నడయినా పొగిడాడా?'

ఏమో, జ్ఞాపకం లేదు!

పొగడటమే కాదు—కాస్త ఆదరంగా, మంచిగా ఒక్క మాటయినా మాట్లాడినట్లు జ్ఞాపకం లేదు.

'ఏదీ, అందుకు అవకాశం శకుంతల ఇస్తే కదా!' అనుకున్నాడు.

పెళ్ళయినప్పటినుండీ పులీ, మేకా బతుకుల్లాగ దుర్భరంగా సాగుతున్నాయి తమ జీవితాలు. భార్య పై ఈ కొత్త ప్రయోగం జరిపి చూడాలనుకున్నాడు.

దాని ఫలితమే కొద్ది క్షణాల క్రితం అతడు శకుంతల ఎడల చూపించిన ఆదరణ'



శకుంతల దారిలో పడుతున్నట్లే అనిపించింది.

టేబిలు సొరుగు బయటకి లాగి అందులోని ఆ నవల ఆఖరు పేరా తీసి, తన కిష్టమయిన వాక్యాన్ని మరోమారు చదువుకొని తృప్తిగా నిట్టూర్చాడు రామ్మూర్తి.

రేపటి దినం తాను నిర్వహించవలసిన కార్యక్రమం ఊహించుకుంటూ పడక గదిలోకి వెళ్ళాడు.

* * *

[illegible] కూర్చుని కురులు ఆరబెట్టుకుంటూంది. పైన తిరుగుతున్న ఫాన్ గాలికి కురులు చెదిరి ఇటూ అటూ ఎగురుతున్నాయి.

రామ్మూర్తి హడావిడిగా గదిలోకి వచ్చాడు.

ఒక్క క్షణం అద్దం ముందు కూర్చున్న శకుంతలను తదేకంగా చూశాడు. తరవాత పాఠం మరిచిపోయిన కుర్రాడికి మల్లే నిశ్శబ్దంగా నిలబడి ఉండిపోయాడు.

అద్దంలోని రామ్మూర్తిని చూసి తీయగా నవ్వింది శకుంతల.

## ద్విభాష్యం రాజేశ్వరరావు

"శకుంతలా!" అన్నాడు రామ్మూర్తి, కొద్ది క్షణాల నిశ్శబ్దం తరవాత.

"ఊఁ!" అంది శకుంతల.

"పెద్ద గాలివాన తరవాతి నీరెండలో ప్రకృతి సుందరి తల ఆరబెట్టుకుంటున్నట్లుంది నిన్ను చూస్తే!" అన్నాడు.

పాఠం అప్పగించినట్లు పొగిడాడే కాని, తరవాత అతనికి ఏం చేయాలో తోచలేదు.

కొంత సేపు ఆగి, "నీ కురులు పట్టుకుచ్చుల్లా ఉన్నాయి, శకూ!" అన్నాడు.

శకుంతల మనోహరంగా నవ్వింది.

"శకూ! నువ్వెప్పుడయినా సింహాచలం తెల్లసంపెంగి పువ్వు చూశావా?" అన్నాడు రామ్మూర్తి.

'మీరు తెస్తేగా, చూడటానికి!' అందామనుకుంది శకుంతల. కాని, అనలేదు. మౌనంగా ఉండిపోయింది.

"సరిగ్గా నీ ముక్కు అలాగే ఉంది!" అంటూ రామ్మూర్తి తన ప్రశ్నకి సమాధానం పూరించాడు.


కొద్ది క్షణాలు ఆగి, "శకూ, నాకు ఆఫీసు టైము అవుతూంది. వెళ్ళొస్తాను" అంటూ కదిలిపోయాడు.

శకుంతల అతని వంక విభ్రాంతితో చూస్తూ ఉండిపోయింది.

* * *

"అబ్బ! చీర మార్చుకుంటున్నాను... ఒక్క క్షణం బయటకి వెళ్ళండి, బాబూ!" అంది శకుంతల సిగ్గుతో.

తలుపు తోసుకుని లోనికి రాబోయిన రామ్మూర్తి తలుపు దగ్గరేఉండిపోయాడు.



కొంతసేపు అతనికి నోట మాట రాలేదు.

ఆ తరవాత "శకూ! నువ్వు వీనస్‌లా ఉన్నావు. పాలరాతితో మలిచి నట్లు నీ భుజాలు గుండ్రంగా ఎంత సౌందర్యంగా ఉన్నాయో!" అన్నాడు.

శకుంతల సిగ్గుతో ముడుచుకు పోయింది.

రామ్మూర్తి తృప్తిగా నిట్టూర్చి, తలుపు దగ్గరగా వేసి బయటికి వెళ్ళి పోయాడు.

కట్టుకోబోయిన చీర దూరంగా విసిరేసి చికాకుతో మంచం మీద వాలి పోయింది శకుంతల.

* * *

నాలుగో రోజు పాఠం ఆఫీసులోనే ఊహించుకొని ఇంటికి వచ్చాడు రామ్మూర్తి. తలుపు తెరిచిన శకుంతలను చూసి అలాగే నిలబడిపోయాడు.

పాలనురుగు లాంటి తెల్లని చీర కట్టు కుంది శకుంతల. ఆకాశనీలం సన్నని బోర్డరు చీరకు మరింత వన్నె తెచ్చింది. గోధుమవర్ణం జాకెట్టు భుజాలకు అతికి నట్లుంది. జడలో తురుముకున్న కదంబమాల కుడి భుజం మీదుగా ముందుకు జారి గాలికి విలాసంగా కదులు తూంది.

"శకుంతలా!" అన్నాడు రామ్మూర్తి, ఆమె వంక కళ్ళు విప్పార్చుకొని చూస్తూ.

శకుంతల మామూలుగా చిన్న చిరునవ్వు ఒలికించింది.

"దివి నుండి పొరపాటున భువికి జారిన కిన్నెరలా ఉన్నావు. నీ సౌందర్యం చూస్తుంటే నాకు మతి పోతూంది" అన్నాడు.

శకుంతల మురిపెంగా ముఖం పెట్టింది.

రామ్మూర్తి తృప్తిగా నవ్వుకుంటూ ఫైల్స్ పట్టుకొని లోనికి నడిచాడు.

శకుంతల నీరసంగా తలుపుకు చేరగిల బడి ఉండిపోయింది.

* * *

ఆ మరుసటి దినం తెల్లవారేసరికి శకుంతల కనిపించలేదు.

టేబిలు సొరుగులోని నవల ఆఖరు పేజీలో మాత్రం ఒక చీటీ కనిపించింది.

"నా కనురెప్పలు తుమ్మెదలు రెక్క లార్చుకుంటున్నట్లు ఉన్నాయన్నారు. నా కళ్ళలోకి ఆప్యాయంగా రెండు క్షణాలు చూస్తారేమో ననుకున్నాను. ఊహూఁ!

కురులు ఆరబెట్టుకుంటూ ఉంటే ప్రకృతి సుందరికి మల్లే ఉన్నావన్నారు. ఆ సౌందర్యాన్ని రెండు క్షణాలు చేతుల మధ్యకు తీసుకుంటా రనుకున్నాను. లేదు!

ముక్కు సింహాచలం తెల్ల సంపంగి పువ్వులా ఉందన్నారు. ముద్దు పెట్టు కుంటారనుకున్నాను. అంత భాగ్యమా?

చీర మార్చుకుంటూ ఉంటే నా సౌందర్యం చూసి వీనస్‌లా ఉన్నావన్నారు. వీనస్‌ని మీ బలమయిన చేతులతో దగ్గరకు తీసుకుని గుండెలకు హత్తుకుంటా రనుకున్నాను. పాలరాతితో మలిచినట్లు ఉన్నాయన్న నా భుజాలను మీరు ఆప్యాయతతో నిమురుతూ ఉంటే మీ గుండెల్లో తల దాచుకోవా లను కున్నాను. ఊహూఁ! తలుపులు దగ్గరగా వేసి వెళ్ళిపోయారు మీరు!

తెల్లచీరలో దివి నుండి దిగిన కిన్నెరకు మల్లే ఉన్నావన్నారు. మురిసిపోయాను. మీ సాన్నిధ్యంలో ఆ క్షణంలో సర్వం మరిచిపోవాలనుకున్నాను. అంత అదృష్టమా? ఫైల్సు తీసుకొని గదిలోకి వెళ్ళిపోయారు. మరి నన్ను పలకరించ లేదు!

నాకీ నాలుగు దినాల్లోనూ రెండు నిజాలు తెలిశాయి. మొదటిది — నేను అందంగా ఉంటానని! మీరే చెప్పారు! రెండోది — మీరు మూర్ఖులని!— అది మీ టేబిలు సొరుగులోని నవలలోని ఆఖరు పేరా చెప్పింది!

కట్టుకున్న ఆడదాని మీద కురిపించ వలసినవి పొగడ్తలు కావు; ఆప్యాయత, అనురాగం!

ఈ ఎనిమిది నెలలూ వాటికోసమే ఎదురు చూశాను. కాని, అవి నాకు గగన కుసుమాలని తెలిసిపోయాయి.

మన పక్కింటి హౌస్‌సర్జన్‌తో వెళ్ళి పోతున్నాను. చాలా ఆలోచించాక ఈ నిర్ణయం తీసుకున్నాను. అతడు ప్రాక్టీసు పెట్టేవరకూ మాకు ఏదో ఆధారం ఉండాలి కదా! అందుకని మీరు బీరువాలో దాచిన అయిదు వేలూ తీసుకెళుతున్నాను. కొద్ది కాలం తరవాత మీ అప్పు తీర్చేస్తాను.

మీ

—వీనస్." ★


జీవితంలో ఆనందాన్ని, ఆహ్లాదాన్ని కలిగించే అనేక మధుర క్షణాలుంటాయి



తలనొప్పి మూలంగా మీ ఆనందాన్ని పాడుచేసుకోవద్దు

2 ఆస్ప్రో తీసుకోండి

మైక్రోఫైన్ ఆస్ప్రో నొప్పిని అతిశీఘ్రంగా తొలగించును

ASPRO
Nicholas

A G.63.TL